# మూగవీణ

**వనితా జ్యోతి, మాసపత్రిక**

"ఆనంద్ ఎవరు? గీత ఎవరు?"

"అదే నండీ... వాళ్ళ గురించి ఎన్నోసార్లు మీతో చెప్పలేదూ?" గుర్తు తెచ్చుకోమన్నట్టు చూసింది వీణాదేవి.

"ఎవరికి గుర్తు? మళ్ళీ చెప్పకూడదా?" విసుక్కున్నాడు సత్యమూర్తి.

"వాళ్ళిద్దరిదీ మా ఊరే. మా ఇంటి పక్కనే వాళ్ళిల్లు. నేనూ, గీతా, వాళ్ళన్నయ్య ఆనంద్ ముగ్గురం కలిసి ఆడుకునేవాళ్ళం. ఎక్కడికి వెళ్ళినా ముగ్గురం కలిసే వెళ్ళేవాళ్ళం. వాళ్ళకి అమ్మా, నాన్నా ఇద్దరూ లేరిప్పుడు...."

"ఓ... గుర్తొచ్చింది... బాగా పేదవాళ్ళని చెప్పావు. వాళ్ళే కదూ?"

చివుక్కుమంది వీణాదేవి మనసు. "ఒకప్పుడు బాగా బతికినవాళ్ళే. వాళ్ళ నాన్నగారికి వ్యాపారంలో చాలా నష్టాలు రావడం వల్లా, ఎక్కువగా అప్పులు చెయ్యడం వల్లా ఉన్నదంతా ఆయనతోనే పోయింది. ఇప్పుడా అన్నాచెల్లెళ్ళు చాలా ఇబ్బందుల్లో వున్నారు. నిన్న మా ఊరునించి వచ్చిన రామారావు గారు చెప్పారు.".

"ఊ...సరే... ఇంతకీ నువ్వు చెప్పబోయేది ఏమిటి?" త్వరగా చెప్పమన్నట్టు చూశాడు.

"మనం కొంత డబ్బు సాయం చేస్తే వాళ్ళకి... సాయపడగల స్థితిలో ఉన్నాం కబట్టి.... చిన్నప్పటినించీ ప్రాణానికి ప్రాణంగా స్నేహంగా ఉన్నాం వాళ్ళూ, నేనూ" భయం భయంగా ఆ మాటలనేసి అమ్మయ్య అనుకుంది.

"ఏదో చిన్నప్పుడు కలిసి తిరిగారు, అయిపోయింది. ఇంక ఇప్పుడు కూడా స్నేహం అంటూ ఆ తిండికి లేనివాళ్ళ..."

వినలేక చెవులు మూసుకుంది వీణాదేవి.

"ఊరికే ఇవ్వమనలేదండీ నేను... అప్పుగానే....."

నోరు విప్పి మరోసారి అడగబోయింది.

"నేను చెప్పవల్సింది చెప్పేశాను. ఇంకనన్నాట్టే విసిగించకు" విసురుగా అక్కడి నించి వెళ్ళిపోయాడు సత్యమూర్తి.

కళ్ళల్లో తిరిగిన నీళ్ళతో అలాగే కూర్చుండి పోయింది వీణాదేవి.

★★ ★★ ★★

"అమ్మగారూ! ఎవరోవచ్చారండీ... అయ్యగారు లేరని చెప్పాను. మిమ్మల్ని పిలవమన్నారండీ" నౌకరు వెంకన్న మాటల్తో చదువుతున్న పుస్తకం పక్కన పడేసి లేచింది వీణాదేవి. "వస్తున్నాను కూర్చోమని చెప్పు."

గదిని పరిశీలనగా చూస్తూ కూర్చున్నాడు ఆనంద్. విలువైన ఫర్నీచర్, కింద కార్పెట్, గోడ కున్న ఖరీదైన పెయింటింగ్సుతో ఆ ఇంటి గొప్పతనాన్ని ఆడంబరంగా సూచిస్తోంది. ఆ డ్రాయింగ్ రూమ్. ఆనంద్‌ని చూస్తూనే, గుమ్మం దగ్గిరే ఆగిపోయింది వీణాదేవి. నవ్వాడు ఆనంద్ పలకరింపుగా "ఏవిటక్కడే నిల్చుండిపోయావు?" ప్రయత్నం మీద నవ్వింది. "ఎప్పుడు బయల్దేరావ్? గీత ఎలా ఉంది?"

కుశల ప్రశ్నలయ్యాయి.

"ఎందుకొచ్చావ్, ఏవిటని అడగవేం?"

"భలేవాడివే, మా ఇంటికి రావడానికి కారణం ఉండాలా?"

"ప్రస్తుతం వుంది. అత్యవసరమైన పనుండే వచ్చాను."

గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి ఆమెకి. ఓ పక్క భర్త ఇంటికొచ్చే వేళవుతోంది... ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవల్సి వొస్తుందో ఏమో! భయంతోనూ, విచారంతోనూ తల వొంచుకుంది.

"మేం చాలా ఇబ్బందుల్లో ఉన్నాం" నెమ్మదిగా అన్నాడు ఆనంద్. తెలియదని ఎలా అనగలను. మనసులోనే అనుకుని మౌనమే వహించింది.

"నువ్వడిగినా అడగకపోయినా అవసరం వుండి వచ్చినవాడిని కాబట్టి నేనొచ్చిన పనేమిటో చెప్తాను. నాకు కొంత డబ్బు అప్పుగా కావాలి. అందుకోసం మీ ఇంటికి రావడానికి కారణం మా చెల్లెలు గీత.. నేను చాలా అభిమానపడుతుంటే, అదే నాకు నచ్చచెప్పి, సర్దిచెప్పి మీ ఇంటికి పంపించింది.."

మాట్లాడకుండా, తన కళ్ళల్లో నీళ్ళు ఆనంద్ కంటపడకుండా, గబుక్కున లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడింది.

ఆమె మాట్లాడకపోవడంతో మళ్ళీ తనే అన్నాడు "ఈ పరిస్థితిలో మాకు సహాయపడే వాళ్ళెవ్వరూ లేరు... ఇలా నిన్ను అడుగుతున్నందుకు నాకు సిగ్గుగానూ, బాధగానూ వుంది.... కానీ, అవసర సమయంలో ప్రాణ స్నేహితురాలు మీకు గుర్తురాలేదా అని నీకు కోపం వొస్తుందేమోనని భయపడింది గీత. అందుకే నిన్ను అడిగి రమ్మని పంపించింది, అప్పుగానే ఎంతో కొంత ఇవ్వు మీవారిని అడిగి మెల్లిమెల్లిగా నెలకింతని ఆ అప్పు తప్పకుండా తీరుస్తాను."

డబ్బు సహాయం చెయ్యటం తన కిష్టమేనని, కానీ తన భర్తకిష్టం లేదనీ ఉన్నమాట చేప్పేస్తే! ఒక్క క్షణం ఆలోచించింది వీణాదేవి.

అదివరకు ఊరికి వెళ్ళినపుడు, ఆనంద్ తోనూ, గీత తోనూ తన భర్త ఎంతో మంచి వాడనీ, దయగలవాడనీ, తనేం చెప్పినా కాదనడనీ ఎన్నెన్నో గొప్పలు చెప్పుకున్న సంగతి గుర్తొచ్చి మనసు కలతపడుతోంది. తన భర్త నిజమైన మనస్తత్వం వాళ్ళకి చెప్తే బాధపడతారని, స్నేహితుల మనసు కష్టపెట్టడం ఇష్టంలేక, ఎంతో దయగలవాడిగా తన భర్తని వాళ్ళ దృష్టిలో చిత్రించింది.

ఇప్పుడు.... వీళ్ళకి సాయపడడం తన భర్తకే ఇష్టం లేదని అసలు నిజం చెప్పేస్తే ఇంకేమన్నా ఉందా? "మరి అంత గొప్పగా చెప్పుకున్నావేం మీవారి గురించి" అని నిలదీసి అడగరూ ఇప్పుడు?

"ఏవిటాలోచిస్తున్నావు వీణా? మీవారేమంటారో అనా? నువ్వు చెప్తే కాదంటారా? జాలి, దయగలవారని, నువ్వేమడిగినా కాదనరని ఓసారి చెప్పావుగా మాతో!"

ఏం మాట్టాడాలో వెంటనే తోచలేదు ఆమెకి .

ఏమైనా సరే, తన భర్తకిష్టం లేదని చెప్పకూడదన్న నిర్ణయానికి వచ్చింది. గుండె దిటవు పరుచుకుని అంది చివరికి "వారేమంటారోనని నేను ఆలోచించట్లేదు, నీకు అప్పుఇస్తేమటుకు ఈ జన్మలో తీర్చుగలవా అని ఆలోచిస్తున్నాను. అందుకే అంత్య నిష్ఠూరంకంటె ఆది నిష్ఠూరం మేలని ఆలోచిస్తున్నాను. డబ్బు మీకు ఇవ్వడం నాకే ఇష్టం లేదు."

"వీణా" నెత్తిన పిడుగు పడినట్టయింది ఆనంద్‌కి. ముఖంలో బాధ తొంగి చూసింది, ఒక్కక్షణమాగి నెమ్మదిగా అన్నాడు. "ఊహూ... నీదేం తప్పులేదు వీణా.. నీదేం తప్పులేదు. పెళ్ళి చేసుకుని వెళ్ళేటప్పుడు, ఎప్పుడైనా ఏదైనా సహాయం కావలిస్తే నిన్నడగమని చెప్పావు. ఆ మాట పట్టుకుని పూర్వంలాగే ఇంకా మామీద నీకు ఆప్యాయత, సానుభూతి వుంటాయని అనుకోవడం మాదే తప్పు. ఎన్నివేలైనా మీకు లెక్కలోకి రావు. తెల్లారి లేస్తే ఎంతమందికో పెద్ద మొత్తాల్లో విరాళాలు విరజిమ్ముతూ వుంటారు మీరు. అటువంటి మీకు.. ఈ పాత స్నేహితులకి కాస్త డబ్బు అప్పుగా ఇవ్వడం కష్టమేమీ కాదనుకుని, ఎంతో ఆశతో వచ్చాను. కానీ, ఉన్నమాట చెప్పి నా కళ్ళు తెరిపించావు. నేను మళ్ళీ అప్పు తీర్చగలనో లేదోనని నీ భయం నీకుండడంలో తప్పులేదు. అనవసరంగా నీ టైము వేస్టు చేసినందుకు, నిన్ను ఇబ్బంది పెట్టినందుకు నన్ను క్షమించు వీణా, వెళ్ళొస్తాను."

అడుగులో అడుగు వేసుకుంటూ, నీరసంగా వెళ్ళిపోయాడు ఆనంద్.

ఆపుకోలేని దుఃఖంతో చేతుల్లో ముఖాన్ని దాచుకుంది వీణాదేవి. తూట్లు పడిన ఆమె హృదయ వీణ, అపశృతులతో విషాదరాగం పలికింది. "ఈ వీణలో కరుణరసం ఒలకదు ఆనంద్... దానికి నేను బాధ్యురాల్ని కాదు. నేను బాధ్యురాల్ని కాదు... వీణ ఎవరి చేతుల్లో వుందో వారు పలికించిన రీతిగా పలుకుతుందే తప్ప, తనంతట తనే రాగాలు వినిపించగల శక్తి వీణకి లేదుకదా! నన్ను నువ్వు మన్నించాలి. నీ మనసు నుంచి తీసిపారేయకు ఈ వీణని" ఆమె హృదయం మూగగా గొణిగింది.

★★ ★★ ★★